క్లుప్తంగా

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణకు శనివారం హైదరాబాద్‌కు చెందిన డి.కిరణ్‌కుమార్ రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు జి.రవికి అందజేశారు. దాతకు దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూ సాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం అంచె వద్ద శనివారం ముచ్చుమర్రి ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్ వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ రికార్డులు కచ్చితంగా ఉండాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఆటో డ్రైవర్లకు సూచించారు. నాటుసారా, అక్రమ కలప, టుంకీ ఆకు, గంజాయి, చౌకబియ్యం రవాణా చేస్తూ పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మహానందిలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత



తలపై చున్నీలు వేసుకుని వెళ్తున్న మహిళలు

మహానంది: భానుడి ఉగ్రరూపానికి జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం పది దాటితే కాలు బయటికి పెట్టలేనంతగా ఎండలు మండుతున్నాయి. శనివారం మహానందిలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులు వేసవితాపాన్ని తీర్చుకునేందుకు కోనేరుల్లో స్నానాలు ఆచరిస్తూ ఉపశమనం పొందారు.

సనాతన ధర్మం పరిఢవిల్లాలి



బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర్ అవధాని

మహానంది: కంచి కామకోటి పీఠం పీఠాధిపతిగా బ్రహ్మశ్రీ సత్య వేంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ శర్మ అతి చిన్న వయసులోనే బాధ్యతలు తీసుకుంటున్న తరుణం ఎంతో శుభకరమని మహానంది దేవస్థానం ఋగ్వేద పండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర్ అవధాని తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాంచీపురంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల చేత స్థాపించబడిన పీఠానికి 71వ పీఠాధిపతిగా శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఆదిశంకరులు తేజం, చంద్రశేఖరేంద్ర సరస్వతుల కఠోరదీక్ష, జయేంద్ర సరస్వతుల ధార్మిక నడత, విజయేంద్ర సరస్వతుల శిష్యరికంలో ప్రసరించి వారి ద్వారా వైది వేద వాఙ్మయం, ఆధ్యాత్మికత మన భారతదేశం నలుమూలలా స్థిరపడాలని, సనాతన ధర్మం పరిఢవిల్లాలని కాంక్షిస్తున్నామన్నారు.

విస్తృత తనిఖీలు



లాడ్జీలో తనిఖీ చేస్తున్న సీఐ రాము, పోలీసులు

ఆత్మకూరు: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాది దాడి నేపథ్యంలో ఆత్మకూరు పట్టణంలో శనివారం సీఐ రాము సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలు, ఆర్టీసీ బస్టాండు, కరివేన, పోలీస్‌స్టేషన్‌ల సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

ఆగమ పాఠశాల వార్షిక పరీక్షలు ప్రారంభం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వీరశైవ ఆగమ పాఠశాల విద్యార్థులకు శనివారం వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. చంద్రవతి కల్యాణమండపంలో ప్రవేశ, వర, ప్రవర కోర్సులకు సంబంధించి మూడు రోజుల పాటు పరీక్షలు నిర్వహించనున్నారు. 105 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. సంస్కృతం, ఆహ్నికం, నిత్యారాధన అంశాలలో పరీక్షలు ఉంటాయి. పరీక్ష నిర్వహణకు డాక్టర్ ఎం.మహంతయ్య, ఆగమ పండితులు ముఖ్య పరీక్ష అధికారిగా వ్యవహరిస్తున్నారు.

హైవే అస్తవ్యస్తం!

- ఇష్టారాజ్యంగా 340సీ ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణం
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్న డ్రైవర్లు, ప్రయాణికులు
- గ్రామాలకు వెళ్లేందుకు ఏర్పాటుచేయని సర్వీసురోడ్లు



ఎన్‌హెచ్ 340సీ రోడ్డు నుంచి మండ్లెం గ్రామంలోకి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయని దృశ్యం

జూపాడుబంగ్లా: జాతీయరహదారి 340సీ రోడ్డు నిర్మాణం పనులు ఇస్టానుసారంగా చేస్తుండటంతో ప్రయాణికులు, డ్రైవర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రూ.1,179 కోట్ల నిధులను వెచ్చించి కర్నూలు నుంచి ఖైర్లూటి వరకు 66.115 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ 340సీ రోడ్డును నిర్మిస్తున్నారు. రోడ్డు డిజైనింగ్ లోపమో లేక కాంట్రాక్టర్ల తప్పిదమో లేక పర్యవేక్షణాధికారుల లోపమో కానీ ఎన్‌హెచ్ 340సీ నాలుగురోడ్ల వెంట ప్రయాణిస్తున్నామనే ఆనందం వాహనాల డ్రైవర్లు, ప్రయాణికుల్లో కానరాకపోగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది.

సర్వీసురోడ్లు ఏవీ..

జాతీయరహదారి 340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా కర్నూలు నుంచి ఖైర్లూటి వరకు రోడ్డు వెంట ఉన్న గ్రామాల్లోకి వెళ్లేందుకు సర్వీసురోడ్లు నిర్మించకపోవటంతో గ్రామాల్లోకి ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనదారులు, కార్లు, వ్యవసాయ రైతుల ట్రాక్టర్లు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్‌హెచ్ 340సీ రోడ్డు నుంచి గ్రామాల్లోకి వెళ్లే మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు, వెనుకనుంచి వచ్చే వాహనాలు వచ్చి ఎక్కడ ఢీకొంటాయోనని ప్రాణభయంతో గ్రామాల్లోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నందికొట్కూరు నుంచి ఆత్మకూరుకు వెళ్లే మార్గంలో తర్తూరు అంచెవద్ద అండర్‌పాస్ వంతెన, సర్వీసు రోడ్డు నిర్మించకపోవటంతో వారం క్రితం ముగిసిన తర్తూరు జాతరకు వెళ్లేందకు ప్రయాణికులు, గ్రామస్తులు, భక్తులు ప్రాణభయంతో రోడ్డును దాటాల్సిన దుస్థితి నెలకొంది.

➤మండ్లెం, తంగడంచ గ్రామాల వద్ద గ్రామాల్లోకి వెళ్లే సమయంలో సరైన సిగ్నల్స్‌తో కూడిన సర్వీసు రోడ్డు ఏర్పాటుచేయకపోవటంతో వెనుక నుంచి వచ్చే వాహనం ముందు వెళ్లే వాహనాన్ని ఢీకొనే ప్రమాదం ఉంది.

➤పారుమంచాల గ్రామం మీదుగా తూడిచెర్ల, వాడాల, రేగడగూడూరు, వెలుగోడు మీదుగా నంద్యాలకు వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. పారుమంచాలకు సర్వీసు రోడ్డు నిర్మించకపోవటంతో 2కిలోమీటర్ల దూరంలోని జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్ వద్ద టర్నింగ్ తీసుకుని మరో రెండుకిలోమీటర్ల దూరంలోని పారుమంచాల రోడ్డుకు చేరుకోవాల్సి వస్తుందని ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు వాపోతున్నారు.

➤తాటిపాడు, తరిగోపుల గ్రామాలకు సర్వీసు రోడ్డు నిర్మించకపోవటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తరిగోపుల గ్రామస్తులు 2కిలోమీటర్ల దూరంలోని 80బన్నూరు గ్రామానికి చేరుకొని అక్కడి నుంచి గ్రామానికి రావాల్సిన దుస్థితి నెలకొంది.



పారుమంచాల గ్రామం మీదుగా నంద్యాలకు వెళ్లాలంటే ఇక్కడికొచ్చి తిరిగి వెళ్లాల్సిందే..

➤ఆత్మకూరు నుంచి నందికొట్కూరుకు బయలుదేరిన వాహనాలు జూపాడుబంగ్లాలోకి వెళ్లాలంటే జూపాడు సమీపంలోని ఇసుకవాగు వద్ద సర్వీసు రోడ్డు ద్వారా వెళ్లాల్సి ఉంది. ఈనేపథ్యంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు స్పీడ్ కంట్రోల్ కాక ప్రమాదవశాత్తూ రోడ్డు క్రాస్ అవుతున్న వాహనాలను ఢీకొనే ప్రమాదం ఉంది. అలాగే పోలీసుస్టేషన్ వద్ద హైవే రోడ్డును ఎక్కే సమయంలో ఇదే పరిస్థితులున్నాయని వాహనాల డ్రైవర్లు పేర్కొంటున్నారు.



తంగడంచ గ్రామంలోకి వెళ్లేందుకు నామమాత్రంగా నిర్మించిన సర్వీసు రోడ్డు

➤తంగడంచ, మండ్లెం గ్రామాల్లోకి ఆర్టీసి బస్సులు వెళ్లాలంటే ఎడమవైపు నుంచి కుడి వైపునున్న తంగడంచ గ్రామంలోకి వెళ్లాల్సి ఉంది. ఇక్కడ ఏమాత్రం ఆదమరచినా రెండు వైపుల వచ్చే వాహనాలు రోడ్డు దాటే వాహనాన్ని ఢీకొనే ప్రమాదం ఉంది.

డిజైన్ లోపమే కారణమా..

నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో డిజైనింగ్ లోపం ఉన్నట్లు కొట్టొచ్చినట్లుగా కనపడటంతో పాటు ఎవరికైనా ఇట్టే అవగతం అవుతుంది. జాతీయరహదారిని నిర్మిస్తున్నారంటే రహదారికి అనుసంధానంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోకి వాహనాల రాకపోకలు జరిగేలా సర్వీసురోడ్లు కచ్చితంగా నిర్మించాల్సి ఉంది. అయితే ఎన్‌హెచ్ 340సీ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న గ్రామాల్లోకి ఆర్టీసి ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా వెళ్లే అవకాశం లేకుండా రోడ్డును నిర్మించటాన్ని చూస్తే ఎన్‌హెచ్ 340సీ రోడ్డు నిర్మాణంలో కచ్చితంగా డిజైనింగ్ లోపం ఉందన్న విషయం స్పష్టమవుతుంది. మేమేమి చేయలేమంటున్న హైవే పర్యవేక్షణాధికారులు: గ్రామాలకు సర్వీసు రోడ్లు నిర్మించి భవిష్యత్‌లో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోకుండా సర్వీసు రోడ్లు నిర్మించాలని ప్రజలు, వాహనాల డ్రైవర్లు, ప్రయాణికులు ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు, ఫిర్యాదులు చేసినా తామేమి చేయలేమని హైవే నిర్మాణ పర్యవేక్షణాధికారులు చేతులెత్తేయటంతో ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లోనైనా ఎన్‌హెచ్ 340సీ రోడ్డు నిర్మాణంలో చేర్పులు, మార్పులు చేయకపోతే భవిష్యత్‌లో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవటంతో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని డ్రైవర్లు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మృతులకు కొవ్వొత్తుల నివాళి



ఇందిరేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, గ్రామ ప్రజలు

ఆత్మకూరు: ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని మండలంలోని ఇందిరేశ్వరం గ్రామస్తులు శనివారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దగ్గుపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజలు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు



రికార్డులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజు

పాములపాడు: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని మండల ప్రత్యేకాధికారి రాజు సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. శనివారం ఆయన పాములపాడు, మిట్టకందాల గ్రామాల సచివాలయాలను తనిఖీచేశారు. హాజరు పట్టికలను పరిశీలించి విధులకు హాజరుకాని ఉద్యోగుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా విధులకు హాజరైతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్ ఉన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతి దేవస్థానంలో శనివారం శాశ్వత హుండీ కానుకలను లెక్కించారు. మూడు నెలల ఐదు రోజులకు గాను రూ.2,06,821 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే దేవస్థానం ఆవరణంలో టెంకాయలు విక్రయించడం, భక్తులు సమర్పించే బియ్యం బియ్యం పోగుచేసుకోవడం, అక్షరాభ్యాసం పూజ సామగ్రి కిట్ విక్రయించుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా రూ.3,47,000 ఆదాయం సమకూరినట్లు నంద్యాల దేవదాయ శాఖ తనిఖీ అధికారి హరిశ్చంద్రరెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి రామలింగారెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకట నాయుడు తెలిపారు. కార్యక్రమంలో శివపురం మాజీ సర్పంచ్ రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంతోనే సీమ సస్యశ్యామలం

- సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి



సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం కోసం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంతోనే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి అన్నారు. శనివారం సాగునీటి సాధన సమితి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బానగచర్ల వద్ద ప్రాజెక్టు నిర్మించి గోదావరి నదిని అనుసంధానం చేస్తానని అబద్ధపు హామీలు మానుకొని సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మాణం చేపట్టాలన్నారు. ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని, శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అమరావతి అభివృద్ధి పేరుతో రూ.లక్షల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం రాయలసీమ ప్రజల కడుపులు నింపే సిద్ధేశ్వరం అలుగు నిర్మానంపై దృష్టి సారించకపోవడం సిగ్గుచేటన్నారు. మే 31న సంగమేశ్వరం వద్ద నిర్వహించే సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన వార్షికోత్సవానికి పెద్ద ఎత్తున రైతులు హాజరు కావాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఉమారాణికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచులు విష్ణువర్ధన్ రెడ్డి, నక్క విజయకుమార్, మాజీ సర్పంచ్ శ్రీనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రహంతుల్లా, నారాయణరెడ్డి, సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు డాక్టర్ డి నాగన్న పాల్గొన్నారు

పొగాకు ట్రాక్టర్ బోల్తా



బోల్తా పడిన పొగాకు ట్రాక్టర్

నందికొట్కూరు: మిడుతూరు మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో శనివారం టాక్టర్ బోల్తా పడింది. చౌట్కూరు గ్రామానికి చెందిన గోపాల్ మిడుతూరులో 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. ఆ పొలంలో చుక్కబర్రి పొగాకు పంట సాగుచేశాడు. మిడుతూరు నుంచి చింతలపల్లికు తరలిస్తున్న సమయంలో మలుపు వద్ద ట్రాక్టర్ ట్రాలీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి



పటేల్ సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నందికొట్కూరు: ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ కోరారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని శనివారం పట్టణంలో కేజీ రోడ్డుపై యూటీఎఫ్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ముర్తుజావలి, షబ్బీర్, జాన్‌క్రిసోస్టమ్, వాసు, నాగరాజు, హబీబుల్లా, జగదీష్, నాగేశ్వరరావు, పంచరత్నం పాల్గొన్నారు.

త్రీఫేస్ విద్యుత్ ఇవ్వండి

కొత్తపల్లి: మండలంలోని జానాల గూడెం, బలపాల తిప్ప గ్రామాలలో నీటి సరఫరాకు త్రీఫేస్ విద్యుత్ సదుపాయం కల్పించాలని జెడ్పీటీసీ సభ్యుడు సుధాకర్ రెడ్డి కోరారు. శనివారం జనాల గూడెం, బలపాల తిప్ప గ్రామాల్లో నీటి సమస్యను తెలుసుకునేందుకు సర్పంచ్ బాల ఎల్లయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడారు.

మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

ఆత్మకూరు: ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక కర్షక విధానాలపై మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్‌లు కోరారు. శనివారం స్థానిక ధనుంజయ మీటింగ్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సీఐటీయూ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. మేడే ఉత్సవాలను కార్మిక వర్గం జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షులు రణధీర్, స్వాములు, మల్లయ్య, పుల్లయ్య, కలిముల్లా, రాంబాబు, శ్రీను, వీరన్న, నూర్‌అహ్మద్, శివ, చిన్న పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి

నందికొట్కూరు: మే డేను కార్మికులు జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి నిర్వీర్యం చేస్తోందన్నారు. హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మహానంది

మహానంది: మహానంది ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవులతో పాటు వీకెండ్ కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలోని మూడు కోనేరులు భక్తులతో నిండిపోయాయి. పెద్దకోనేరులో భక్తులు కేరింతలు కొట్టారు. స్నానాల అనంతరం భక్తులు కామేశ్వరీదేవి, మహానందీశ్వర ఆలయాలతో పాటు కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు. ఉదయం నుంచి రద్దీ నెలకొంది.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పగిడ్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు రూ.200 ప్రవేశం రుసుం చెల్లించి మే 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు: పట్టణంలోని నీలిషికారిపేటలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను స్పెషల్ టీం, ఎక్సైజ్ ఎస్ఐలు జబ్రూల్లా, బాష్యం శ్రీనివాసులు, మారుతీ ప్రసాద్ ధ్వంసం చేశారు. దుల్‌భాయ్ నుంచి నాలుగు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేశారు.

జేఎఫ్‌సీఎం కోర్టు మంజూరుకు కృషి చేయాలి

నందికొట్కూరు: జేఎఫ్‌సీఎం కోర్టు మంజూరుకు కృషి చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు శరబయ్య అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే జయసూర్యను కోరారు. శనివారం న్యాయశాఖ మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లి జేఎఫ్‌సీఎం కోర్టు నందికొట్కూరుకు మంజూరు అయ్యేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో న్యాయవాదులు భాస్కర్, చెరుకు వెంకటేశ్వర్లు, బలపాల కుమార్ ఉన్నారు.

ఆస్తి పన్ను తగ్గించాలి

ఆత్మకూరు: పట్టణాల్లో పెంచిన ఆస్తి పన్నును తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు, చైర్‌పర్సన్ ఆసియామారూఫ్‌కు అర్జీ అందించారు. సమావేశంలో నాయకులు వీరన్న, పాల శివుడు, గణపతి, రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

వేసవిలో మంచినీటి ఎద్దడిని అరికడతాం

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆసియామారూఫ్



హాజరైన కౌన్సిల్ సభ్యులు



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: వేసవిలో తాగునీటి ఎద్దడిని అరికడతామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. గరీబ్‌నగర్‌తోపాటు పట్టణంలోని పలు చోట్ల తీవ్ర తాగునీటి ఎద్దడి ఉందని సభ్యుడు విజయ్‌చౌదరి, కుక్కల బెడద అధికంగా ఉందని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని, పారిశుధ్య కార్మికులు డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదని సభ్యురాలు పాణ్యం సరోజ సభ దృష్టికి తెచ్చారు. తమ కాలనీలో వీధి స్తంభాలను ఏర్పాటు చేయాలని సభ్యులు రంగస్వామి కోరారు. మరో సభ్యుడు విజయ్ మాట్లాడుతూ తాము రూపాయి కూడా కమీషన్ తీసుకోలేదని, పట్టణాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నాని చెప్పారు. అనంతరం చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కేజీ రోడ్డు నుంచి ఓల్డ్ బస్టాండు వరకు సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ.25 లక్షలకు పైగా, సిద్ధపల్లి రోడ్డు నుంచి గవర్నమెంటు ఆసుపత్రి వరకు బోర్‌వెల్, మోటార్లు, ఇతర పైపులైన్ ఏర్పాటుకు రూ.7.25 లక్షలు, పాత బస్టాండు నుంచి నేతాజీనగర్, అరుణా మెడికల్ స్టోర్ వరకు రూ.19.49 లక్షలు, రబ్బానీ కాంప్లెక్స్ నుంచి పద్మావతి లేడీస్ టైలర్ షాపు వరకు రూ.15.63 లక్షలు, వడ్ల రామాపురం రస్తా నుంచి మంచినీటి సౌకర్యం కోసం మోటార్లు, పైపులైన్ల నిర్మాణానికి రూ.8.86 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వడ్ల రామాపురం రస్తా నుంచి ఏబీఎం పాలెంలో నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ లెట్రిన్లను తొలగించేందుకు కౌన్సిలర్ల అనుమతిని కోరారు. గుండ్లకమ్మవాగు పూడికతీత పనులకు రూ.99 వేలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి గరీబ్‌నగర్ వరకు పూడికతీత గుండ్లకమ్మ వాగులో రెండోచోట్ల తీసేందుకు మరో రూ.99 వేలు నిధులను కేటాయిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలు తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్, తిరుపతయ్య, అన్నివార్డు కౌన్సిలర్ సభ్యులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు

ఆత్మకూరు: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, నాయకులు రామ్‌నాయక్‌లు అన్నారు. శనివారం వారు పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పాలకోడేరు గ్రామంలో పేదల ఇళ్లను రఘురామకృష్ణంరాజు కూల్చివేయించారన్నారు. ప్రజల పక్షాన నిలబడి న్యాయం చేయాలని పోరాడుతున్న శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, రఘురామకృష్ణంరాజును వెంటనే ప్రభుత్వం ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఫేర్వెల్ పార్టీ

నందికొట్కూరు: పట్టణంలోని బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో శనివారం ఫేర్వెల్ పార్టీని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా డిగ్రీ కళాశాల చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బాగా చదువుకుని తల్లిదండ్రులకు, అధ్యాపకులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, రమేష్, సరళాదేవి, డైరెక్టర్లు శ్రీకాంత్, రమేష్‌రెడ్డి, శ్రీనాథ్, రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ జాన్ ఎలీషాబాబు పాల్గొన్నారు.

ఇరవై నిమిషాలకోసారి ఫీడర్ ట్రిప్

జూపాడుబంగ్లా: విద్యుత్ కోతలతో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. శనివారం 80బన్నూరు ఫీడర్ ప్రతి 20 నిమిషాలకో సారి ట్రిప్ అవుతుండటంతో ఈ ఫీడర్ కింద ఉన్న తాటిపాడు, 80బన్నూరు, పోతులపాడు, చాబోలు, తరిగోపుల, కృష్ణరావుపేట గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ మెయిన్‌టెనెన్స్ సక్రమంగా చేయకపోవటం తోనే ఫీడర్ నిత్యం ట్రిప్ అవుతుందనే విమర్శలున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళా వేదికపై హైదరాబాద్‌కు చెందిన వై.మాధురీ మనోహర్ వారి సంప్రదాయ నత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విఘ్నరాజంభజే, మూషికవాహన, శివాష్టకం, నాగస్తుతి, జతిస్వరం శివ తాండవం తదితర గీతాలకు, అష్టకాలకు ప్రతిష్ఠ, హిమజ, ఋత్విక, శ్లోక, శ్రీప్రియ, వీక్ష ణ,తపస్వి, అక్షర, భువన,అంజలి, వర్షిత, ఋగ్వేద్, ధాత్రి, గ్రీష్మ తదితరులు నృత్యాలు ప్రదర్శించారు .

ఆవులను తీసుకెళ్లండి



గుర్తుతెలియని ఆవులు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పరమటూరు గ్రామంలో 20 రోజులుగా గుర్తు తెలియని ఆవులు సంచరిస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం ఆవు, లేగ దూడ, రెండు గిత్తలు గ్రామంలోని వీధుల్లో 20 రోజులుగా సంచరిస్తున్నాయన్నారు. ఆవులను గుర్తించి వాటి యజమానులు తీసుకెళ్లాలని గ్రామస్తులు కోరారు.